# చేపల చెరువు

■ బోయ జంగయ్య

ఈసారి చెర్లో నీళ్ళు ఏమాత్రం తగ్గలేదు. పొలాల్లో వరి కంకులు పాలు పోసుకుంటున్నాయి. చేపలు మాత్రం బాగా బలిశాయి. వాటికోసం చేపల కాంట్రాక్టర్స్ కాచుకుని ఉన్నారు. పంచాయతీ వాళ్ళు తమ చూపును కాపలాగా ఉంచారు. రైతులు వరి కంకులను చూస్తూ మురిసిపోతున్నారు. అంతేకాదు, చెర్లో ఉన్న నీటితో కత్తెర పంటకు లోటుండదు. అయితే, నీరు వదలొద్దూ.

చెరువు కట్టమీది నుంచి ఊళ్ళోకి పోతూ ఉంటే మొట్టమొదట ఓ ఓపెన్ గ్రౌండులో వివిధ రాజకీయ పార్టీల జెండాల దిమ్మెలు. వాటిపై ఆయా పార్టీల గుర్తులు. ఆ గుర్తు కింద జనం గుంపులుగా విడిపోయి ఉన్నారు. ఏ పండుగకు ఆ దేవున్ని కొలిచినట్టుగ ఏ పార్టీ మీటింగ్‌కు ఆ పార్టీవాళ్ళు గుమికూడి మీటింగ్ జరుపుకుంటారు. పండుగనాడు తాగినట్టే ఆ మీటింగ్ నాడు కూడా తాగి తందానలాడుతారు. అందువల్ల ఉన్నా, లేకున్నా పండుగలన్నా, పార్టీ మీటింగులన్నా ఆ ఊరి జనానికి ఎంతో ఇష్టం. ఆ ఖాళీ స్థలాన్ని దాటి కొంచెం ముందుకు పోతే కులాల వారీగా వాడలు కనిపిస్తాయి. యాదవ-కురుమ ఇండ్ల పందిళ్ళ కిందా ఆరోజే పుట్టిన గొర్రె పిల్లలు, మేక పిల్లలు కనిపిస్తాయి.

మరొక వాడలో కాపుతనపు రైతుల ఇళ్ళు. వాళ్ళ వాకిళ్ళలో రెండు గుమ్మలు పక్కమ్మటె ఉండే పాకల్లో గేదెలు, వాటి దూడలు కనిపిస్తాయి. నడి ఊళ్ళో వడ్ల కమ్మరివాళ్ళ ఇళ్ళు, వాళ్ళు పనిచేసే కొలుములు, దాటీలు కనిపిస్తాయి.

ఆ తరువాత గౌండ్లవాళ్ళ ఇండ్లు. వాటి సాయమాన్ల మొగురాలకు మట్టి లొట్లు కనిపిస్తాయి. ఆ తరువాత ఓ పక్కన రజకులు, క్షురకుల ఇళ్ళు, మరోపక్క కుమ్మరి ఇళ్ళు, వాళ్ళ పందిళ్ళ ఎదురుగా కుండలు కాల్చే వాములు ఉన్నాయి. ఊరి చివర ఒకవైపు దళితుల ఇండ్లు, మరొక వైపు మరొక దళితవర్గం ఇండ్లు ఉన్నాయి. ఆ తరువాత దొడ్లు, గడ్డి కొడార్లు ఉన్నాయి. ఆ ఊరి చెరువు నీరు తూర్పు వైపు పారిస్తుంది.

* * *

ఆ ఊరి రైతులందరూ యం.ఆర్.ఓ కార్యాలయం ముందు గుమికూడారు. అందరూ సంతకాలు చేసిన అర్జీ ఓ యువ రైతు చేతిలో ఉంది. యం.ఆర్.ఓ పిలుపు రాగానే ఆయన గదిలోకి వెళ్ళి అర్జీ పత్రాన్ని అందజేస్తూ, "మాకు న్యాయం చేకూర్చవలసిందిగ మనవి" అన్నాడు.

అర్జీని అందుకున్న యం.ఆర్.ఓ దానిని పూర్తిగా చదివి, "ఆర్.ఐని పంపిస్తాను. వెళ్ళండి" అన్నాడు.

"మేము చెరువు దగ్గర ఉంటాం సార్" అన్నారు.

"సరే" అంటూ బెల్ నొక్కాడు. యం.ఆర్.ఓకు చేతులు జోడించి అందరూ బయటికి నడిచారు. అందరూ ఊరు చేరి చెరువు కట్ట మొదట ఉన్న వేప చెట్ల కింద కూర్చొని ఆర్.ఐ రాక కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. అనుకున్నట్లే ఆర్.ఐగారి మోటారు సైకిల్ వచ్చి ఆగింది.

బ్యాగ్‌లో నుండి తన డైరీ తీసి, దానిలో ఉన్న ఇంతకు ముందు వాళ్ళు ఇచ్చిన అర్జీని తీసి పై భాగాన్ని కళ్ళతోనే మౌనంగా చదివి, చివరి పేరాను అందరూ వినేటట్టుగా చదివాడు.

"చెరువులోని నీళ్ళను వదిలితే చేపలు పట్టడానికి వీలుంటుందని గ్రామపంచాయతికి ధరఖాస్తు పెట్టారు. వొదలడానికి ఒప్పందం కుదిరింది. రేపో మాపో నీరు వదలనున్నారు. అట్లా వదిలితే కత్తెర పంటకు నీరు చాలదు. అందువల్ల రైతుకెంతో నష్టం జరుగగలదు. అందువల్ల కత్తెర తరువాత వదిలితే బాగుంటుందని వదలకుండా ఉంచవలసిందిగా మనవి. ఎన్నో ఏండ్ల తరువాత గానీ చెరువు ఇంతగా నిండింది. వాటిని వృథాగా వదల వద్దని ప్రార్థిస్తున్నాం.

తుమ్మలగూడెం,
రైతులు."

ఆర్.ఐ ధరఖాస్తు చదివి అక్కడ కూడిన రైతుల వైపు చూశాడు. కట్టమీద నడుస్తూ చెరువులోని



నీళ్ళను. దానికింది ఆయకట్టను చూశాడు. చెర్లోని చేపలను చూస్తూ నిలుచున్నాడు. తాను ఊళ్ళో లేని కారణంగా అప్పుడే వచ్చిన గ్రామాధికారి, ఆర్.ఐకి నమస్కరించి రైతులను ఆగమని సైగ చేశాడు. ఇద్దరూ చెరువు అలుగు వరకు నడిచి అక్కడ ఆగారు.

"ఏమంటారు వీళ్ళు" అని అడిగారు.

"ఏముంది. కత్తెర పంటకు సరిపోయే నీరుంది. చేపలు పట్టడం కోసం నీటిని వదలొద్దు అంటున్నారు.

"నీవేమన్నావు" అని కాస్త లావుగా ఉన్న గ్రామాధికారి బ్యాగ్‌ను చూస్తూ అడిగాడు.

"వీలు కాదు. చేపల కాంట్రాక్టర్ గట్టివాడు. వీని సంగతి మీకు తెలుసు కదా అన్నాను." ఆర్.ఐ తన బ్యాగ్‌ను చూస్తున్నది గ్రహించిన గ్రామాధికారి తన బ్యాగ్‌ను చంకకు దగ్గరికి చేస్తూ ఓసారి సర్దుకున్నాడు.

"అంటే ఏమన్నారు?"

"అందుకే ఉన్నంతలో మేమూ అని" చేతి వేళ్ళను చూపించాడు. "అప్పుడే ఇచ్చారు గూడ" అన్నాడు ముసిముసిగా నవ్వుతూ.

'అట్లనా' అన్నట్టు చూశాడు ఆర్.ఐ విప్పారిన ముఖంతో.

'మరి లేకపోతే' అన్నట్టు కనురెప్పలను ఓసారి వాల్చి చూశాడు. ఇద్దరూ అలుగులో నుండి కట్టమీదికెక్కి ఊరివైపు నడిచారు. మధ్యలో నిలుచున్న రైతులవైపు చూస్తూ ఆర్.ఐ, 'నేను చూసుకుంట' అన్నట్లు బరోసాగా రైతులవైపు చూశాడు. ఆ సైగను గ్రహించిన రైతుల ముఖాలలో వెలుతురు పూసింది.

*　　*　　*

ఊళ్ళోకి జీపు వచ్చింది. వస్తూ వస్తూ బజార్లోని దుమ్మునంతా లేపుతూ వచ్చింది. అది సందులు గొందులు దాటి చెరువు కట్టకొమ్మున ఆగింది. కొంచెం పక్కకు కట్టెమ్మెకు ఓ కానుగ చెట్టు. దానికింద మైసమ్మ గుడి. మూడు వైపుల మూడు బండలు, వాటి పైకప్పుగ మరో బండ. ఆ బండలకంతా పసుపు, కుంకుమ బొట్లు, నూనె మరకలు. దాని లోపల ఓ నల్ల రాయి. దానికీ పసుపు, కుంకుమ బొట్లు. దాని ఎదురుగా ఓ కొత్త కుండ, దానిమీద ఓ కంచుడు. ఆ కంచుట్లో పత్తిని ఒత్తి చేసి, నూనె పోసి వెలిగిస్తూ ఉంటారు. ఇంకా ఆ గూట్లో ఎన్నో దీపంతలు.

గుడి ముందు కానుగు చెట్టుకు వేలాడదీసిన ఉట్టి. ఆ ఉట్టిలోనూ మరో చిన్న మట్టి పటువ. దానిమీద మరో కంచుడు. అలాగే చుట్టూ వేలాడదీసిన గొర్రెల, మేకల తెగకోసిన కాళ్ళు.

ఆగిన జీపులో నుండి దిగిన ఓ లావుపాటి మీసాల వ్యక్తి గుడివైపు నడిచాడు. ఆయన దిగినప్పుడు జీపు అటూ ఇటూ ఊగింది. జీపులో ఉన్న మిగతా ఇద్దరూ ఆయన్ను అనుసరించారు.

మీసాల వ్యక్తి మైసమ్మ దగ్గరికి వెళ్ళి అక్కడ ఉన్న కుంకుమను తీసుకుని నుదుట అర్ధరూపాయంత బొట్టు పెట్టుకున్నాడు. అనుచరులు అలాగే చేశారు. ఒకడు అగరొత్తులను అంటించాడు. మరొకడు తన దగ్గరున్న సారా సీసాను అందించాడు. మీసాల వ్యక్తి కొంత సారాను ఆరపోశాడు. మరొక వ్యక్తి అందించిన కొబ్బరికాయను పట్టుకుని మైసమ్మకు దండం పెట్టి కొట్టి, ఇప్పటికి దీంతో సరిపెట్టుకో అన్నట్టు చూశాడు. ఆ తరువాత కొబ్బరి చిప్పలను అనుచరులు అందుకోగా, అక్కడి నుంచి కదిలి కట్టెక్కారు.

అప్పటివరకు కట్టెక్కి పడుకున్న తాబేలు తనలాంటి వాడెవరో వస్తున్నారని నీటిలోకి జారుకుంది. మీసాల ఆసామీ చెరువు నీటిని పార చూశాడు. నీటిలోని చేపల మీద దృష్టి నిలిపాడు. నగం నీరు తగ్గడం వల్ల ఆ నీటిలో అన్నీ వంద రూపాయల నోట్లు కదులుతున్నట్లు అనిపించాయి.



నర్సిం

నీరు వదిలితే కత్తెర పంట వేయలేమని రైతులు పట్టు పట్టారు. చేపలను ఇంకా చెర్లో ఉంచితే నగానికి నగం తరుగు వస్తాయని కాంట్రాక్టర్ గోల.

అప్పుడాయన కళ్ళలో మధ్యాహ్నపు ఎండ నీటిలో బంగారం కనిపించింది. కాసేపు కళ్ళు మూసుకున్నాడు. చేతులు జోడించి చెరువుకు దండం పెట్టాడు. సరిగ్గా ఓ చేప పిల్ల నీటి నుండి పైకి ఎగిరి మళ్ళీ నీటిలో పడింది. అప్పుడది నీలం వజ్రంలాగా చమక్‌మంది. మీసాల కింద చిరునవ్వు కదిలింది. కట్టమీద నిలుచున్న అతని రూపం- పట్టు లాల్చీ, తెల్లని పూనా పాంటులో, మెడకు పులిగోళ్ళ బంగారు గొలుసు, ఎడమ, కుడిచేతి వేళ్ళకు మూడేసి ఉంగరాలతో, భుజంమీద ఎర్రని కండువాతో, ఆయన పక్కనే తన అనుచరుల ప్రతిబింబాలు చెరువులో కనిపించాయి. కానీ, అవి ఉన్నంత కాకుండా పొట్టిగా కనిపిస్తున్నాయి. వాళ్ళ ప్రతిరూపాలు కనిపించినంత లెక్కన చేపలు కదలడం లేదు. అవి బెదిరి పక్కలకు పారిపోతూ ఉన్నాయి. బహుశా వీళ్ళ రహస్యం తెలుసుకున్నట్టున్నాయి.

"నగం కంటే ఎక్కువ నీటిని వదిలితే గాని పట్టొచ్చు" అన్నాడు మీసాల వ్యక్తి.

ఆయన ఓ పెద్ద చేపల కాంట్రాక్టర్. అన్ని చెరువుల్లో చేపలను పట్టి కలకత్తాకు లారీల కొద్దీ పంపిస్తూ ఉంటాడు. కట్టలకు కట్టలు నోట్లు తెచ్చుకుంటూ ఉంటాడు. కలకత్తాలో కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్రలో రూలింగ్ పార్టీ అండ ఆయనకుంది.

*　　*　　*

పంట విలువ తెలియని పదిమంది ఇట్లా తలో మాట అంటుంటే, రైతులు వీలు లేదు, నీరు వదిలితే కత్తెర పంట వేయలేమని పట్టు పట్టారు. నీటి పారుదల శాఖ చుట్టూ, యం.ఆర్.ఓ చుట్టూ

తిరుగుతూనే ఉన్నారు. చేపలను ఇంకా చెర్లో ఉంచితే సగానికి సగం తరుగు వస్తాయని కాంట్రాక్టర్ గోల.

ఊళ్ళో ఉన్న యస్.టి.డి నుండి తన యజమానికి ఫోను చేసి పరిస్థితిని తెలియజేస్తూ ఉన్నాడు కాంట్రాక్టర్ గుమాస్తా.

"అదీ సంగతి. ఊరి రైతులంతా వీలుకాదు అంటున్నారు."

"హల్లో. ఏంటి నీవు మాట్లాడేది? వాళ్ళకు డడిస్తే మనం వ్యాపారం చేసినట్టే. నేను హైద్రాబాదు ఫోన్ చేసి ఫలానా వాళ్ళను రప్పిస్తాను, మక్కెలిరుగ తంతారు. అప్పుడు వాళ్ళ గుణం కుదురుతుంది. డబ్బులకు ఆశపడని మనిషి, దెబ్బలకు భయపడని మనిషి ఉండర్రా బాబు. అవన్నీ నే చూసుకుంటగా."

"అలాగే" అంటూ ఫోను పెట్టేసి బిల్ కట్టేశాడు. గుమాస్తా అక్కడి నుండి కదుల్తూ,

'ఈ చెరువు పరిస్థితి ఇలా ఉంటే మిగతా చెరువుల సంగతి ఏమిటో' అనుకున్నాడు. చెరువు వైపు నడిచి కట్టెక్కి నిలుచున్నాడు.

చెర్లో చేపలు బిలబిలమంటూ నీటి ఉపరితలానికి చేరి సూర్యుని వైపు చూస్తున్నాయి. వాటిని చూసిన గుమాస్తా 'ఈసారి ఫైనలే ఫైనలు' అనుకుంటూ కట్టకిందికి చూశాడు. వరిచేను చాలా ఒత్తుగా పెరిగి, పణలుపణలుగ పాలు పోసుకుని గింజలు పసుపు రంగులోకి మారుతున్న దశ. మరో పది రోజుల్లో తెరిపి లేకుండా నీరు అందితే గాని చేతికి రావు. అప్పుడు కాని పశువులకు గడ్డి, మనుషులకు తిండి రాదు. ఈ పరిస్థితి ఎట్లా గట్టెక్కుతుందో అనుకున్నాడు.

చెరువు కట్ట చివరన ఓ నులక మంచం, దానిమీద పొడగాటి టార్చ్ లైటు ఉంది. ఆ మంచం చెరువు కాపలా దారునిది. ఆ పక్కనే ఉన్న బండమీద పొడగాటి తెల్ల చేపలను పొట్టలు చీల్చి, శుభ్రం చేసి, ఎండబెట్టి ఉన్నాయి. వాటిమీద రేగు కంప. గుమాస్తా మంచం మీద కూర్చుని, తన జేబులో నుంచి నోటు బుక్ తీసి, ఊళ్ళోని ముఖ్యుల పేర్లను వరుసగా రాసుకున్నాడు. మరొక పేజీలో మరికొన్ని పేర్లు రాసుకున్నాడు. తనకు తెలియని పేర్లు కొన్నిటిని అక్కడి కాపలా అతన్ని అడిగి తెలుసుకున్నాడు. నోటు బుక్కును జేబులో పెట్టుకుంటూ ఓసారి ఆవులించాడు. ఆవులించినప్పుడు కళ్ళలో తిరిగిన నీరు మెరిసింది.

తాను మొట్టమొదట ఈ ఊరొచ్చిన రోజులు గుర్తొచ్చాయి.

ఒక రోజు ఒకావిడ పట్టపగలు బట్టలుతుక్కోవడానికి చెరువు దగ్గరికి వచ్చింది. ప్రౌఢవయసులో ఉన్న ఆమె ఓ మాదిరిగా చూసి నవ్వింది. విరగ కాసిన మామిడి కొమ్మలాగా వంగి సుతారంగ ఎడమ చేతితో చూపులకు అడ్డం వస్తున్న కురులను చెవి మధ్యన చెక్కుకుంటూ ఉంది. అప్పుడు ఆకులు పక్కకు జరిగితే కాయలు కనిపించినట్టు కనిపించాయి. చూపు అక్కడే ఆగింది. 'ఇది ఊరు గాని ఊరు.' మనసు హెచ్చరించింది. వెంటనే తాను ఏదీ పట్టనట్టు ముఖాన్ని బిగపట్టుకుని నిలుచున్నాడు.

ఆ తరువాత మరొకరోజు కట్టమీద ఎదురైంది. అప్పుడు ఆమె కొంగు నడుంకు చుట్టుకుని చంకలో బట్టల మూటతో ఉంది. అతనిలో కాస్త తడబాటు చోటు చేసుకుంది. ఆమె అదోలాగా చూసింది. అంతే చెరువులో రాయి విసిరితే చెరువు నీరంతా కదిలినట్టుగా అతని ఒంట్లోనూ ఏవేవో ఆకర్షణ తరంగాల అలజడి.

ఆమె చేతులను చూసి అతడు అవాక్కయ్యాడు. ఆమె చేతులకు గాజులు లేవు. అప్పుడతను అయ్యో అనుకున్నాడు. ఆమె మీద అనుకోకుండా సానుభూతి పెరిగింది. అప్పుడతనికి మనిషికుండే సహజ లక్షణాలు గుర్తొచ్చాయి.

'ఆకలి, దూప, నిద్ర.' ఆ తరువాత మరొకసారి ఆమెవైపు చూశాడు. ఆమె నవ్వింది. అతనూ నవ్వాడు. ఇద్దరి నవ్వులు చెరువులోని నీళ్ళలో ప్రతిబింబించాయి. ఆ తరువాత చెరువులోని చేపలు అప్పుడప్పుడు ఆమె ఇంట్లోకి ఎదురెక్కేయి. ఆ వాసన వాడంతా పాకింది.

ఊరు ఊరే కదా, కొందరు 'పోనీలే' అని ఊర్కున్నారు. మరికొందరు పట్టించుకుని పట్టుకుని కొట్టారు. కొట్టిన కొందరి పేర్లే ఇంతకు ముందు రెండవ పేజీలోకి ఎక్కినయి.

ఆ తరువాత కొన్నాళ్ళు అతను ఆ ఊరే రాలేదు. ఆమె వైపే చూడలేదు.

తన భార్యను తెచ్చుకుని పక్క ఊళ్ళో కాపురం పెట్టుకున్నాడు.

* * *

ఊళ్ళో ముఖ్యమైన వాళ్ళ ఇండ్లకు లీటర్ లీటర్ సారా, రెండు రెండు తెల్ల చేపలు చేరినాయి. రెండు రోజులు పండుగ చేసుకున్నారు.

"అవును, చెరువు నీరు వొదలంది చేపలు ఎట్ల పడతారు?"

"వదలవలసిందే" అని ఒకరు.

"తప్పదు. లేకపోతే నష్టం" అని మరొకరు అన్నారు.



**పణలుపణలుగ పాలు పోసుకుని గింజలు పసుపు రంగులోకి మారు తున్న దశ. ఈ పది రోజులూ నీరు అందితే గాని చేతికి రావు.**

"తూకానికొచ్చిన చేపలను ఇంకా ఎక్కువ కాలం చెర్లోనే ఉంచితే, దిగిపోయి తూకం రావు" అన్నాడు గుమాస్తా. కాంట్రాక్టరు ఊళ్ళోకి రావడం లేదు. చెర్లో గుడ్డి కొంగలాగా గుమాస్తా తిరుగుతున్నాడు. కొంగను చూసి కాకులు, గద్దలు వాలినట్లు పరాయివాళ్ళు, కిరాయివాళ్ళు సందకాడ దిగుతున్న సందడి.

* * *

గ్రామాధికారి తన వాకిట్లో మంచం మీద కూర్చొని ఎండ కాస్తూ ఉన్నాడు.

అప్పుడే అక్కడకొచ్చిన పెద్ద రైతు, "రాత్రి రైతులందరు మీదగ్గరికి వస్తమన్నరు" అన్నాడు.

"ఎందుకట" అన్నాడు గ్రామాధికారి.

"అదే చెరువు పంచాయితి కోసమట."

"ఇంక పంచాయితి ఏంది? ఈయాల్ల ఆర్.డి.ఓ గారు వస్తారు" అన్నాడు.

"రాకుంట చూడమంటరు."

అప్పుడే కోళ్ళ గూటి తలుపు తెరిచినట్టుంది. పిల్లల కోడి తన పిల్లలను ఎంటేసుకుని వాకిట్లో తిరుగుతా ఉంది.

"ఎందుకని?" లేచి నిలుచుంటూ అడిగాడు.

"నీటిని వదులొచ్చు" అంటున్నారు.

"వాళ్ళకేమన్నా పిచ్చి పట్టిందా?"

"అవులగాండ్లు" అని రైతులను తిడుతూ ఇంట్లోకి నడిచాడు.

సరిగ్గా ఓ పదిమంది రైతులు వచ్చి గ్రామాధికారి ఇంట్లోకి నడిచారు. ఆ ఇల్లు ఎంతో విశాలమైంది. గ్రామాధికారి భూమి పుట్ర ఉన్న పెద్దరైతే. ఆ ఊరికి ఏ అధికారి వచ్చినా ఆయన ఇంట్లోనే ఆతిథ్యం.

వచ్చిన వాళ్ళలో ఎవరూ హుషారుగా లేరు. ముఖాలు ముడుచుకుని కొందరు, దుఃఖపూరిత ముఖాలతో మరి కొందరు. గ్రామాధికారికి అర్థం కాలేదు.

"ఏమిటి అందరూ ఇలా ఉన్నారు. ఏం జరిగింది" అని అడిగాడు.

"మూడు నాలుగు రోజుల నుంచి వాడకట్టు కొకన్ని చితకకొట్టిపోతున్నారు" అన్నాడు ఓ రైతు.

"ఎవరట?" గ్రామాధికారి నివ్వెరపోతూ అడిగాడు.

"తెలవదు" అన్నట్టు చూశారు అందరూ.

"మరి ఫిర్యాదు చేయలేదేమి? నేను ఊళ్ళో లేక రెండ్రోజులైంది."

"ఫిర్యాదు చేస్తే చంపేస్తాం అని చెప్పి పోతున్నారు."

"ఎవరబ్బ! నక్సల్స్ కాదు కదా" అంటూ ఏదో ఆలోచనల్లోకి వెళ్ళాడు. అయినా, వాళ్ళు మన తెరువు ఎందుకు వస్తారు?

అందరూ మౌనంగా నిలుచున్నారు.

"ఈ రోజు ఆర్డీవోగారొస్తారు. ఆ చెరువు విషయం తేలుతుంది. మీరు కోరినట్టే నీటిని వదలరు" అన్నాడు.

ఎవరూ మాట్లాడలేదు. ఒకరైతు వచ్చి తన చొక్కాను లేపి తనను కొట్టిన దెబ్బలు చూపించాడు. అట్లాగే ఇంకో రైతు కమిలిన తన వీపును చూపించాడు.

గ్రామాధికారి నోటిమీద వేలేసుకుని చూస్తూ –

"ఏందర్ర ఇది, ఊరా పాడ? ఎందుకిట్లా జరుగుతుంది? మరి ఇంత జరుగుతుంటే సర్పంచ్ గారు ఏం చేస్తున్నట్టు? చూస్తూ కూర్చున్నాడా" అని అడిగాడు.

"ఆయన ఊళ్ళో ఉంటే కదా. అంతో ఇంతో అందుకుని పట్నంలో పడుకున్నాడె" అన్నాడు ఓ రైతు.

"మరి ఊరేమైపోవాలని?"

"మళ్ళీ ఎన్నికలొచ్చినప్పుడు కదా ఆలోచించేది" అన్నారు.

కండువాలో చుట్టి ఉంచిన మూటని చేతిలో పట్టుకొని చాటుకు తీసుకెళ్ళి అతని దోసిట్లో ఉంచుతూ, "ఆర్.డి.ఓ గారు రాకుండ సూడాలి. చెరువు నీటిని వదిలి పెట్టాలి" అన్నాడు పెద్ద రైతు.

గ్రామాధికారి నోరు తెరుస్తూ, "వాళ్ళకు పిచ్చిగాని పట్టిందా" అన్నాడు.

"పైసలిచ్చి పని చేయమంటున్నారు. మీ అంతల మీరు చేస్తలేరు కదా" అని సలహా ఇచ్చాడు.

పైసల వైపే చూస్తూ- 'వాళ్ళిష్టం చేసేది ఏముంది?' అనుకున్నాడు.

గ్రామాధికారి డబ్బులు తీసుకోవడం చూసి రైతులు ఏదో బరువును దించుకున్నట్టు ఊపిరి పీల్చుకున్నట్టు చూశారు.

"సరె వెళ్ళండి! నేను డివిజన్ ఆఫీసుకు వెళ్ళొస్త. లేకపోతే ఆర్.డి.ఓ గారొస్తారు" అంటూ అందర్నీ వాకిలి వరకు సాగనంపి తాను ఇంట్లోకి నడిచాడు.

ఊరి పరిస్థితి ఇట్లా మారినందుకు విచారిస్తూ, చెరువు ఊరికి ఉపకారం చేస్తుందేమో అనుకుంటే చెరువు చెడే చేసేటట్టు ఉంది కదా అనుకుంటూ వాకిట్లోకి వచ్చి నిల్చున్నాడు. సరిగ్గా అప్పుడే ఓ కోడిపుంజు మరో కోడిపుంజును తరుముతూ వెళ్ళింది. అది చూసి మనుషులకు వీటికి తేడా ఏముంది అనుకుంటూ బస్టాండ్ వైపు నడిచాడు.

ఆ ఊరికి ఆర్.డి.ఓ రానే రాలేదు! ■